సిఎల్‌నాయుడుకు ఇంటర్నేషనల్ స్టార్ ఐకాన్ అవార్డు

పాలకొండ: పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త పలు విశ్వ విద్యాలయాల నుంచి డాక్టరేట్లు పొందిన డాక్టర్ సిఎల్ నాయుడుకు మరో అవార్డు వరించింది. ఇండియన్ సోలిడారిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ స్టార్ ఐకాన్ అవార్డు వరించినట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో 40, అంతర్జాతీయ స్థాయిలో 11 అవార్డులు వచ్చినట్టు గుర్తు చేశారు. ఈ అవార్డు ప్రధానోత్సవం ఈనెల 28న తమిళనాడులో జరగనుందని తెలిపారు.

అవార్డు ప్రతిని చూపుతున్న సిఎల్ నాయుడు

సహకార సంఘాల ద్వారానే పాలసేకరణ

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

పాడిరైతుల నుంచి పాల సేకరణ సహకార సంఘాల ద్వారానే జరగాలని, అమూల్ సంస్థ ద్వారా పాల సేకరణ చేయరాదని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అధ్యక్షతన జిల్లా పాడి రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ నానాటికి పశు సంపద తగ్గి పాల ఉత్పత్తి క్షీణిస్తుందని, మన దేశం పాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్నప్పటికీ జనాభా పెరుగుదల రీత్యా పాల సగటు ఉత్పత్తి తగ్గుతుందని అన్నారు. ప్రభుత్వం పాల సేకరణ అమూల్ సంస్థ ద్వారా చేపడుతోందని, దీనివలన పాల రైతుల సహకార సంఘాలన్నీ నిర్వీర్యం అవుతాయని వివరించారు. పాల సేకరణ సహకార సంఘాల ద్వారానే చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికే చాలామంది రైతులు పాలకు తగిన గిట్టుబాటు ధర లేక పాడి పరిశ్రమను విడిచిపెడుతున్నారని, ప్రభుత్వం రైతు సమస్యలను దృష్టిలో ఉంచుకొని పాలకు తగిన ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. బోనస్ పెంచాలని, పశువులకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించి, మందులు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. పాడి రైతుల సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంబాబు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే లీటరు పాలకు నాలుగు రూపాయలు చొప్పున పెంచుతామని ప్రకటించినా నేటి వరకు అమలు చేయలేదని అన్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పాడి పరిశ్రమకు అనుసంధానం చేయాలని, దీనివలన పాడి రైతులకు కొంతమేర ఆర్థిక ఆసరా దొరుకుతుందని అన్నారు. జిల్లాలో అన్ని పాల సేకరణ కేంద్రాల వద్ద పాల రైతుల డిమాండ్స్ తెలియజేస్తూ గ్రామాల్లో సంతకాల సేకరణ చేపట్టాలని ఈ సందర్భంగా సమావేశంలో తీర్మానం చేశారు.

రాష్ట్రంలో సహకార డెయిరీల అభివృద్ధికి మౌళిక వసతులు కల్పనకు ప్రభుత్వం కషి చేయాలి. జిల్లా సహకార డెయిరీలను 1964 చట్టం ప్రకారం నడపాలి. ఇతర చట్టాలలోకి వెళ్లిన డెయిరీలను 1964 చట్టంలోకి తేవాలని, సహకార డెయిరీల ఆస్తులను, వనరులను, అమూల్ సంస్థకు అప్పగించవద్దని డిమాండ్ చేశారు. ప్రతి లీటరు పాలకు అదనంగా రూ.10 చెల్లించాలన్నారు. 70శాతం సబ్సిడీ ధరకు దాణా, మేత ప్రభుత్వం సరఫరా చేయాలని, పశువుల కొనుగోళ్లకు బ్యాంకులు ద్వారా వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, పాలసేకరణ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, గేదెల సత్యనారాయణ, సహాయ కార్యదర్శులు అప్పారావు, కరణం రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

గడప గడపకు పనుల ప్రతిపాదనలు సమర్పించాలి

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన పనుల ప్రతిపాదనలు తక్షణం సమర్పించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, ఉపాధి హామీ పథకంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు, సిబ్బందితో శుక్ర వారం కలెక్టర్ అవగాహన, సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.124 కోట్ల విలువ గల పనులు చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. జిల్లాకు ఇది మంచి అవకాశమని స్పష్టం చేశారు. జిల్లాకు మౌలిక సదుపాయాల కల్పన అవసరం ఉందని, ఈ కార్యక్రమాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో రూ.40 లక్షల విలువ వరకు పనులు చేసుకునే అవకాశం ప్రభుత్వం జిల్లాకు కల్పించిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపడుతున్న పనులకు బిల్లులు వెంటనే మంజూరవుతాయన్నారు. బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. 83 సచివాలయాల పరిధిలో రూ.40 లక్షల విలువ గల పనులు మంజూరు చేశామని చెప్పారు. బలిజిపేట మండలానికి రూ.38 లక్షలు, సాలూరు మండలానికి రూ.4 లక్షలు, పార్వతీపురం మండలానికి రూ.4 లక్షలు చెల్లింపులు జరిగాయని చెప్పారు. రూ.1.42 కోట్ల విలువకు చెందిన బిల్లులు అప్ లోడ్ చేయడం జరిగిందని, త్వరలో జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు. మరో 79 పనులకు చెందిన బిల్లులు అప్ లోడ్ చేస్తున్నారని ఆయన వివరించారు. సచివాలయ పరిధిలో తిరిగి పనులు గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలో ప్రతిపాదనలు సమర్పించకపోతే, పనులు మంజూరు జరగదని, భవిష్యత్తులో పనులు మంజూరు కావని స్పష్టం చేశారు. పనులు మంజూరు చేసిన 72 గంటల్లో ప్రారంభం కావాలని ఆదేశించారు. పనులకు సంబంధించిన అగ్రిమెంట్, నామినేషన్ తదితర అంశాలు ఐదు రోజుల్లో మండల స్థాయి బృందం పూర్తి చేయాలన్నారు. వచ్చే పది రోజులు గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ పనులు లక్ష్యంగా పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఇంజినీర్లు వృత్తి నిబద్ధతతో, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్లను, సిబ్బందిని ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. మంజూరు చేసిన పనులు పూర్తి అయిన వెంటనే కొత్త పనులు ప్రతిపాదించాలన్నారు. బిల్లులు అప్ లోడ్ చేయుటకు 24X7 వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్వతీపురం రెవిన్యూ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం పనులను పార్వతీపురం ఐటిడిఎ పిఒ, పాలకొండ రెవిన్యూ డివిజన్ పరిధిలో సీతంపేట ఐటిడిఎ పిఒను పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం పనులకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ఆయన స్పష్టం చేశారు. అవగాహన సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు సి. విష్ణు చరణ్, కల్పనా కుమారి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ. ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్లు జె. రామఅప్పల నాయుడు, హెచ్.శంకరరావు, ఎస్.సర్వేశ్వరరావు, జిల్లా ప్రజా ఆరోగ్య శాఖ అధికారి కెజిఎన్ నరసింగరావు, డిఇలు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఖాళీ కంచాలు, నల్ల బ్యాడ్జీలతో

104 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - కురుపాం

104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు ఆ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని దశల వారీ ఉద్యమ కార్యచరణలో భాగంగా మండలంలో ధర్మలక్ష్మీ పురంలో 104 పైలెట్ పి.సురేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ మురళి నల్ల బ్యాడ్జీలు ధరించి, ఖాళీ కంచాలు పట్టుకొని తమ ఆకలి కేకలు పట్టించుకోండి ముఖ్యమంత్రి గారు అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో భాగంగా 104ఉద్యోగుల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



బిక్షాటన చేస్తున్న 104 సిబ్బంది

ఉద్యోగ భద్రత కల్పించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన

వీరఘట్టం : 104 ఎంఎంయూ వాహన ఉద్యోగులకు డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని స్థానిక పిహెచ్‌సి వద్ద 104 సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ప్రజా సంకల్ప యాత్రలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 104 ఎంఎంయూలో ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని, వేతనాల పెంపు అమలు చేసి ఉద్యోగుల కుటుంబాల్లో చిరునవ్వులు చిందిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. నాలుగేళ్లయిన ఈ హామీ అమలుకు నోచుకోలేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, వాహనాలకు సకాలంలో క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయాలని, ఫిట్నెస్, ఇన్సూరెన్స్ కూడా చేయించి ఉద్యోగుల హెల్త్, గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలని, వీటితో పాటు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జిఒ1రద్దు ప్రజాస్వామ్య విజయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి దోపిడీలను, మోసాలను, నేరాలను కప్పిపుచ్చేందుకు తెచ్చిన కుట్ర జీవో నెంబర్ 1 అని, ఈ జీవోను రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కొట్టి వేయడం ప్రజాస్వామ్య విజయంగా భావిస్తున్నామని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం మండలం, తాడికొండలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, క్లస్టర్ ఇన్చార్జి వెంకటరావు, నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఆర్గనైజర్ పోలూరు శ్రీనివాసరావు, టిడిపి కార్యకర్తలు ఎస్.రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

కొమరాడ : ప్రతిపక్షాల గొంతు నొక్కేలా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఒ1ను హైకోర్టు రద్దు చేయడం అభినందయమని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.సాంబమూర్తి అన్నారు. రాష్ట్రంలో సభలు, రోడ్ షోలు, ర్యాలీలపై ఆంక్షలు విధిస్తూ జీవో నెం.1ను తీసుకు రావడం చాలా అన్యాయమని, దీనిపై సిపిఎంతో పాటు మిగతా వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద పోరాటాలు జరిగిన నేపథ్యంలో ఈరోజు జీవోను హైకోర్టు రద్దు చేయడం శుభపరిణామని తెలిపారు.

పార్వతీపురం రూరల్ : జిఒ 1ను హైకోర్టు కొట్టివేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంప పెట్టన్నారు.

సాలూరు : భారత రాజ్యాంగానిదే అంతిమ విజయమని జిఒ 1పై రాష్ట్ర హైకోర్టు తీర్పు రుజువు చేసిందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు రోడ్ షోలు, నిరసనలు వ్యక్తం చేయకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో1 1 అనైతికమని చెప్పారు.

ప్రభుత్వానికి చెంపపెట్టు: సిఐటియు

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 1 రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు చెప్పారు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ప్రజాసమస్యలపై రోడ్లపై నిరసన సభలు, ఆందోళన చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. అలాంటి హక్కుని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 1 చెల్లదని తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు.

జెసి విష్ణుచరణ్‌కు వినతిని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ అన్నారు. ఉద్యోగ సంఘాల జెఎసి సభ్యులతో శుక్ర వారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్థానికంగా తమ పరిధిలో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి పంపించాల్సిన ప్రతిపాదనలు అక్కడకు పంపిస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని, చక్కగా పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆయన కోరారు. వివిధ శాఖలకు చెందిన జెఎసి సభ్యులు తమ సమస్యలను వివరించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకట రావు, ఉద్యోగ సంఘాల జెఎసి సభ్యులు కిషోర్, శ్రీరామ్మూర్తి, జి.నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి : యుటిఎఫ్

పార్వతీపురం ఎంఇఒ పివి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, ఎస్.మురళీమోహనరావు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కోరారు. ఉద్యోగ జెఎసి నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు పార్వతీపురం ఎంఇఒపై ఫిర్యాదు చేశారు. ఎంఇఒ మహిళా ఉపాధ్యాయులపై, గిరిజన, ఇతర ఉపాధ్యాయులపై కక్ష సాధింపులు, వివక్షతకు పాల్పడుతున్నారని, దీనిపై డిఇఒ, ఆర్‌జెడిలకు విన్నవించామని తెలిపారు. వారు విచారణకు ఆదేశించినా, ఇంత వరకు విచారం పూర్తి చేయలేదని అన్నారు. అలాగే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని అడగడానికి వెళ్లిన సంఘనాయకులపై, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చేపడుతున్నారు. తనకు నచ్చిన వారి సమస్యలు పరిష్కరించి మిగిలిన వారి సమస్యలు పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేవారు. వీటిపై వెంటనే సమగ్ర దర్యాప్తుకు ఆదేశించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వీరఘట్టం ఎంఇఒ, కెజిబివి స్పెషలాఫీసర్‌పై సస్పెన్షన్ల ఎత్తివేతకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని కోరడమైనది.

సెలవుల్లో పనిచేయించే విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులను పని చేయాలనే విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో చైర్మెన్ వి.ధనుంజయనాయుడు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్.మురళీమోహనరావు తెలిపారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు అన్ని జిల్లాల డిఇఒల ద్వారా ప్రభుత్వానికి వినతులు ఇవ్వాలన్న నిర్ణయం మేరకు శుక్రవారం స్థానిక డిఇఒ కార్యలయం ఎడికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు ఎస్‌సిఇఆర్‌టి నిర్దేశించిన బాధ్యతలు, వుయ్‌లవ్ రీడింగ్ కార్యక్రమాలకు గానీ, పదో తరగతి పరీక్షల్లో ఫెయిలయిన విద్యార్థులకు అదనపు తరగతులకు సంబంధించి గానీ కమిషనర్ నుంచి గానీ, డిఇఒ ద్వారా గాని, హెచ్‌ఎంల ద్వారా ఉత్తర్వులు ఇవ్వకుండానే పని చేయించు కుంటున్నారన్నారు. ఈ విధానాన్ని ఫ్యాప్టో వ్యతిరేకిస్తుందని, సెలవుల్లో పనిచేయించుకున్న వారికి ఆర్జిత శెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు టి.రమేష్, నల్ల బాలకృష్ణ, శివున్నాయుడు, పిహెచ్‌సి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కలెక్టరేట్

రానున్న విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. భామిని, కురుపాం, ములక్కాయవలస (మక్కువ), పురోహితునివలస (సాలూరు)లో ఆదర్శ పాఠశాలలలో చేరేందుకు ప్రవేశ పరీక్షకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వివరాలకు www.cse.ap.gov.in/apms.ap.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. ఒసి, బిసి కులాలకు చెందిన విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుండి 2013 ఆగష్టు 31 మధ్య పుట్టి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2009 సెప్టెంబరు 1 నుండి 2013 ఆగష్టు 31 మధ్య పుట్టిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల్లో చదివి ఉండాలని, 2022- 23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 25లోపు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డ్‌లను ఉపయోగించి పేమెంట్ గేట్‌వే ద్వారా అప్లికేషన్ రుసుము చెల్లించిన వారికి జనరల్ నెంబర్ కేటాయించడం జరుగుతుందని, జనరల్ నెంబర్ ఆధారంగా www.cse.ap.gov.in/apms.ap.gov.in% వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు రుసుము ఒసి, బిసిలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.50 అన్నారు. ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షలో ఒసి, బిసి విద్యార్థులు 35 మార్కులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు అర్హతగా నిర్ణయించడం జరిగిందని చెప్పారు. ప్రవేశాలు పూర్తిగా ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం పూర్తిగా ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, జిల్లా విద్యా శాఖాధికారిని సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఖరీఫ్‌కు విత్తనాలు, ఎరువులు సిద్ధం

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎడి

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ ఎడి మధుసూదనరావు కోరారు. శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయంలో చైర్మన్ కె.మన్మథరావు అధ్యక్షతన జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, విత్తనాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని కోరారు. ఎప్పటిలాగే రైతులకు అవసరమైన ధాన్యం విత్తనాలు ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేయాలని సూచించారు. రైతు భరోసా డబ్బుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పిఎం కిసాన్ సహాయం మంజూరు కోసం ఈకెవైసి లింక్ చేసుకోవాలన్నారు. జీడి, మామిడి పంటలకు జరిగిన నష్టానికి పరిహారం మంజూరయ్యేలా చూడాలని రైతులు కోరారు. సమావేశంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఎఒ అనురాధ పండా పాల్గొన్నారు.

కౌలు కార్డులు దరఖాస్తులు చేసుకోవాలి

సీతానగరం : కౌలు రైతులు కార్డులకు దరఖాస్తు చేయించుకోవాలని, భూయజమాని అంగీకారంతో కౌలు కార్డు జారీ చేయనున్నట్టు తహశీల్దార ఎంవి రమణ తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కౌలు కార్డు కౌలు రైతుకు ఇవ్వడం వల్ల భూయజమానికి ఎటువంటి నష్టం ఉండదన్నారు. ప్రతి ఏటా పంట కాలానుగుణంగా కౌలు కార్డు చేసుకోవాలని, రైతులంతా ఈ విషయాన్ని గమనించి విఆర్‌ఒను సంప్రదించి కౌలు కార్డు చేయించుకోవాలని తెలిపారు. ఎఒ అవినాష్ మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌కు ముందస్తుగా వేసే పచ్చిరొట్ట ఎరువులను గూర్చి చర్చిస్తూ ముందుగానే అన్ని ఆర్‌బికెల్లో కట్టెలు, జీలుగలు, పిల్లిపెసర విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. మండలానికి మొక్కజొన్న కొనుగోలు కేంద్రంగా పార్వతీపురం సొసైటీని కేటాయించారన్నారు. క్వింటా మొక్కజొన్న రూ.1960గా నిర్దేశించబడిందని చెప్పారు. అలాగే వైఎస్ఆర్ భరోసాకు సంబంధించి 2023-24కు గాను మొదటి విడత నగదు ఈ నెలాఖరుకు జమ అవుతుందన్నారు. అన్ని ఆర్‌బికెల్లోల్లో అర్హుల జాబితాను అతికించామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులైన రైతులుంటే రైతు భరోసా పథకానికి నమోదు చేసుకోకపోతే మే 15 నుంచి 18 వరకు గ్రీవెన్స్ పోర్టల్ అందుబాటులో ఉంటుందని ఈ విషయం రైతులంతా గమనించాలని తెలిపారు. పిఎం కిసాన్‌కు సంబంధించి మండలంలో 8873 రైతులకు 7115 మంది రైతులు ఇకెవైసి చేయించుకోగా, 1758 మంది రైతులు ఇంకా పెండింగ్ ఉన్నారని తెలిపారు. వీరు తక్షణమే ఇకెవైసి చేయించుకోవాలని తెలిపారు. సమావేశంలో పశు వైద్యాధికారి ఎస్. రామారావు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎడి మధుసూదనరావు

అటవీ, విద్యుత్ శాఖల నిర్లక్ష్యానికి ఏనుగులు బలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

భామిని మండలం కాట్రగడ వద్ద విద్యుత్ షాక్‌కు గురై నాలుగు ఏనుగుల చావుకు కారణం అటవీ, విద్యుత్ శాఖల నిర్లక్ష్యమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. అడవిలో నుండి దారి తప్పి గ్రామాల్లో సంచరిస్తున్న ఏనుగులను జూకు కానీ అడవుల్లోకి గానీ తరలించాలని గత కొన్నేళ్లుగా ఎన్నోసార్లు అధికారులు మొరపెట్టుకున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదని విమర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ట్రాన్ఫార్మర్‌కు కంచి ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాల్సిన బాధ్యత కూడా విద్యుత్ శాఖ దేనిని, ఈ రెండు శాఖల నిర్లక్ష్యం వల్లే ఈరోజు నాలుగు మూగజీవులు బలైపోయా యని విమర్శించారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులను జూకు కానీ అడవులకు కానీ తరలించాల్సిందిగా డిమాండ్ చేశారు.

ప్రజలకు వైద్యసేవలందడం లేదు

వైద్య, ఆరోగ్య సిబ్బంది పనితీరుపై సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పాచిపెంట, గురువునాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని, ప్రజలకు వైద్య సేవలు అందడం లేదని పలువురు సభ్యులు వైద్యాధికారులపై ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రధానంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పనితీరు బాగోలేదంటూ సభ్యుల ధ్వజమెత్తారు. వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని, శాఖా పరంగా ఎటువంటి కార్యక్రమాలు జరిగినా ప్రజా ప్రతినిధులకు తెలపడంలేదని నిలదీశారు. దీనికి స్పందించిన ఎంపిపి మాట్లాడుతూ కార్యక్రమం ఏదైనా చేపడితే స్థానిక ప్రజాప్రతినిధులు తెలియజేయాలని, ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సాగుకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూస్తామని, ప్రతి రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తామని తెలిపారు. అలాగే ఖరీఫ్ సాగు ప్రణాళిక మ్యాప్‌ను ఎంపిపి చేతుల మీదుగా విడుదల చేశారు. కొటికిపెంట సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయని సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంత ప్రజా ప్రతినిధులు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. మండలంలో చేపడుతున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిమిత్తం భారీ వాహనాలు పాచిపెంట, పాంచాలి మీదుగా రాకపోకలతో రోడ్లు పూర్తిగా మరమ్మతులకు గురవుతున్నాయని రోడ్ల మరమ్మతుల బాధ్యత ఎవరు వహిస్తారో తెలియజేయాలంటూ మండల ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి తీర్మానం చేసి నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో వైస్ ఎంపిపి కె.ధనుంజయరావు, మీసాల నారాయణ, ఎంపిడిఒ జీలకర్ర ఉమామహేశ్వరి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపల్ జీవన జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గానూ అడ్మిషన్లు జరుగుతున్నాయని, తమ కళాశాలలో బిఎస్‌సి, బిఎ, బిజెడ్సిఇ గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. తమ కాలేజీలో అనుభవం కలిగిన ఉన్నతమైన అధ్యాపకులు బాధ్యతగా విద్యార్థులకు బోధించడమే కాకుండా ఉన్నత విద్య కొరకు ప్రత్యేక తరగతులు నిర్వహణ అన్ని విభాగాల్లోనూ ప్రాక్టికల్స్ జరిపించుట చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ఆహార పొట్లాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అన్నదానాన్ని మించిన దానం లేదు

పార్వతీపురంటౌన్ : అన్నదానాన్ని మించిన దానం లేదని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. శుక్రవారం స్థానిక కస్పా పరమేశ్వరి కోలంక ఆలయం వద్ద సంఘం పెద్దల ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆలయం వద్ద నిత్యం జరుగుతున్న నిత్యాన్నదానంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయ కమిటీ పెద్దలతో కలిసి ఆయన చేతుల మీదుగా పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. అనంతరం ఆలయం వెనుక భాగాన గల ఆవరణంలో సిసి రోడ్డు, కాలువ నిర్మాణం చేపట్టి ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆలయ కమిటీ పెద్దలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

లచ్చయ్యపేటలో ఫ్యామిలీ ఫిజీషియన్

సీతానగరం : లచ్చయ్యపేటలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం సీతానగరం పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉషారాణి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయోవృద్ధులకు ఎక్కువగా బిపి, షుగర్ రావడం వాటి వల్ల కంటి చూపుతగ్గడం, మిగతా వ్యాధులు సోకడం జరుగుతుందన్నారు. ఇలాంటి వారందరికీ అన్ని వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు ఇస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు. అలాగే వారి ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. అలాగే బిపి, షుగర్, వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, గర్భిణులకు, బాలింతలకు అన్ని వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు అందజేస్తున్నామన్నారు. ప్రజలంతా ఈ వైద్య సేవలు వినియెగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పుతున్న డ్రాయింగ్ టీచర్ మురళి

చిన్నారులకు చిత్రలేఖనంలో మెలకువలు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఐదో రోజు తంపటాపల్లి డ్రాయింగ్ మాష్టర్ గొర్లె మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు డ్రాయింగ్‌లో కొన్ని ముఖ్యమైన అంశాలు చెప్పారు. కలర్ పెయింటింగ్, కొన్ని రంగులు కలిపితే ఏ రంగులు వస్తాయో అవి ఎలా కలపాలో వివరించారు. ఆ తర్వాత పెదకాపు వీధి హై స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు మండల వెంకటరమణ, పిల్లలకు నీతి కథలు చెప్పారు. కార్యక్రమంలో ఇంఛార్జి గ్రంథాలయ అధికారి గణేష్ బాబు పాల్గొన్నారు. రేపటి కార్యక్రమంలో పిల్లలకు మట్టితో బొమ్మలు ఎలా తయారు చేయాలో మురళి మాస్టారు చెప్తారని, వీలైతే కొందరు బంక మట్టి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

వాచ్‌మెన్ పోస్ట్ నియామకంలో గందరగోళం

వీరఘట్టం : మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్మెన్ పోస్ట్ నియమకానికి సంబంధించి శుక్రవారం పాలకొండ ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు, ఎంపిడిఒ వై.వెంకటరమణ, పాఠశాల కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు కూడా పాఠశాల వద్దకు చేరుకోవడంతో గందరగోళం ఏర్పడింది. 9మంది పాఠశాల కమిటీ సభ్యుల్లో నలుగురు మాత్రమే హాజరు కావడంతో కోరం నియామకాన్ని నిలిపివేశారు. పాఠశాల కమిటీ ఆమోదంతోనే నైట్‌వాచ్మెన్ పోస్ట్ నియామకం జరుగుతోందని డిప్యూటీ డిఇఒ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మరడాన లక్ష్మి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.రవి, పంచాయతీ కార్యదర్శి మధు, విఆర్‌ఒ సింహాచలం, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం రూరల్ : సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి వైద్య సిబ్బంది తగు నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డి ఐ ఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. మండలంలోని గంగాపురం, కోరి, కవిటిబద్ర గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని తనిఖీ చేసి మందులు, పరీక్షల కిట్లు, రికార్డులు పరిశీలించారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జ్వరనిర్ధారణ పరీక్షలు, మందులు గ్రామాల్లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన చేపట్టి ఒఆర్ఎస్, జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేసి వాటి ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, ఇతర శాఖల సమన్వయంతో డ్రై డే కార్యక్రమాలు పక్కగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన గర్భిణీ, బాలింతల గృహ సందర్శనలు చేసి వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఎంసిపి కార్డులను పరిశీలించి తగు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. అనంతరం ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జయగౌడ్, సరోజిని , భారతి , ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

బొబ్బిలి రూరల్ : కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి ఎసరు పెట్టె కార్యక్రమానికి వ్యతిరేకంగా ఈనెల 22న సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కార్యమాన్ని జయప్రదం చెయ్యాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. శుక్రవారం అలజంగిలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడవద్దని, బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయాలని, ఒక్క పూటే పని పెట్టాలని, 200 రోజులు పని కల్పించి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న విజయనగరం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేపడతామన్నారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం ప్రజల కోరికలు తుంగలో తొక్కిందని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ క్రమంగా ఎత్తివేసేందుకు పూనుకుందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మణి కుమార్, కూలీలు పాల్గొన్నారు

సిబ్బంది కొరత... సౌకర్యాలు లేమి

- సమస్యల కొలువు ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్
- కాలేజీలో చేరేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు
- మన్యంలో నీరుగారుతున్న సాంకేతిక విద్య

మోడల్ పాలిటెక్నిక్ కాలేజీ

ప్రజాశక్తి - సీతంపేట

పేరు గొప్ప... ఊరుదిబ్బ అన్న చందంలా ఉంది స్థానిక ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నికల్ కళాశాల దుస్థితి. పేరులోని ఆదర్శం... ప్రగతిలో నిస్తేజంలా ఉంది ఈ కాలేజీ పరిస్థితి. దీంతో సాంకేతిక విద్య గిరిజన విద్యార్థులకు అందని ద్రాక్షలా మారింది.

స్థానిక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నికల్ కళాశాల సమస్యలతో సతమతమవుతుంది. అధ్యాపకులు, సిబ్బంది, మౌలిక సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ కళాశాలకు అధ్యాపకుల పోస్టులు మంజూరు చేయకపోవడంతో పొరుగు జిల్లాల నుంచి వారానికి రెండు రోజులు పాటు డిప్యూటేషన్ పద్ధతిలో కళాశాల నిర్వహిస్తున్నారు. 2014లో ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నికల్ కళాశాల మంజూరైంది. కాలేజీ అయితే ప్రభుత్వం మంజూరు చేసింది కానీ విద్యార్థులకు బోధించే అధ్యాపకులను నియమించలేదు. శ్రీకాకుళం పాలిటెక్నికల్ కళాశాలలో హెడ్ ఆఫ్ జనరల్ సెక్షన్ అధికారి సీతంపేట పాలిటెక్నికల్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్‌గా (ఒఎస్‌డి) డాక్టర్ డిఆర్ఎస్ గంగస్వామి వ్యవహరిస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి డిప్యూటేషన్‌పై అధ్యాపకులు వచ్చిపోతున్నారు. సివిల్, మెకానికల్ కోర్సులకు 162మంది చొప్పున సీట్లు ఉన్నాయి. అయితే అధ్యాపకులు, మౌలిక సదుపాయాల్లేకపోవడంతో ఈ రెండు కోర్సులకు కలిపి కేవలం 18 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. రెండో సంవత్సరంలో ఒక విద్యార్థి కూడా చేరలేదంటే ఈ కాలేజీ పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే అర్థమైపోతుంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఈ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్, సివిల్ కోర్సులు ఉన్నాయి. మెకానికల్ బ్రాంచ్‌లో ఒక హెడ్, ఇద్దరు సీనియర్ లెక్చరర్లు, ఐదుగురు జూనియర్ లెక్చరర్లు, నలుగురు వర్క్ షాప్ ఇన్‌స్ట్రక్టర్లు, 8 మంది అసిస్టెంట్లు ఉండాలి. అయితే వీరిలో ఒక కాంట్రాక్ట్ లెక్చరర్ మాత్రమే ఉన్నారు. మిగతావారు శ్రీకాకుళం పాలిటెక్నికల్ కళాశాల నుంచి డిప్యూటేషన్‌పై వస్తున్నారు. సివిల్ బ్రాంచికి సంబంధించి ఒక హెడ్, సీనియర్ లెక్చరర్, ఐదుగురు జూనియర్ లెక్చరర్లు, నలుగురు ల్యాబ్ అసిస్టెంట్లు జనరల్ సెక్షన్‌కు ఒక హెడ్ ఉండాలి అయితే. రెగ్యులర్ అధ్యాపకులు లేక పాడేరు నుంచి డిప్యూటేషన్‌పై ఓ అధ్యాపకుడు రాగా, ఫిజిక్స్‌కు విజయనగరం నుంచి మోహన్‌కుమార్, కెమిస్ట్రీకి ఆమదాలవలస నుండి వెంకట్రావు, ఇంగ్లీష్‌కు శ్రీకాకుళం నుంచి మహేష్ డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. వీరంతా వారానికి రెండు రోజులు వచ్చి పాఠాలు బోధిస్తున్నారు. ఇంకా పిఇటి, నలుగురు ల్యాబ్ అసిస్టెంట్లు, నలుగురు స్వీపకర్లు, రెండు వాచ్మెన్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ల్యాబ్‌కు సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందితోనే ప్రిన్సిపాల్ నెట్టుకొస్తున్నారు.

టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి ఇటీవల ఈ కాలేజీని సందర్శించారు. విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించారు. అంతవరకు బాగానే ఉన్నా స్టేట్ టెక్నికల్ బోర్డ్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ నుంచి కొంత నిధులు కేటాయించారు. అయితే భోజనం నిర్వహణ కోసం లేకపోవడంతో ఉన్న సిబ్బందితోనే హాస్టల్ నిర్వహణ చేస్తున్నారు. 2014లో సుమారు నాలుగు కోట్లతో కాలేజీ నిర్మించినప్పటికీ భవనం పైన ఫ్లోరింగ్ ఇంతవరకూ పూర్తి చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కనీసం తాగునీరు, వాడుకనీరు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ కళాశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రి వేళలో విష జంతువులు వస్తున్నాయని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలిటెక్నికల్ కళాశాలకు సీసీ రహదారి ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో పనులు చేయకపోవడంతో సీతంపేట రహదారి నుంచి నౌగూడకు వెళ్లే రహదారి రాళ్లు తేలిపోవడంతో రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అసౌకర్యాల మధ్య ఉన్న సిబ్బందితో మెరుగైనా ఫలితాలు సాధించుకొస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించి, కాలేజీలో మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావాలని ఈ ప్రాంత గిరిజన విద్యార్థులు కోరుతున్నారు.

సిబ్బంది కొరత వేధిస్తుంది

కాలేజీలో చాలా తక్కువ సిబ్బంది ఉంది. ఉన్న సిబ్బందితో అధిక శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాం..ఫైనల్ ఇయర్‌లో చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చేలా కష్టపడి పనిచేస్తున్నాం. స్టీల్‌ప్లాంట్‌లో శిక్షణ ఇప్పిస్తాన్నాం. మౌలిక సదుపాయాలు కల్పిస్తే మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేస్తాం.

డాక్టర్ డి.ఆర్.ఎస్ గంగస్వామి,
ప్రిన్సిపల్ ఒఎస్‌డి సీతంపేట, జిఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాల.

ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు రాము

15న కలెక్టరేట్ వద్ద ధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని, కూలీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి విడనడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.రాము డిమాండ్ చేశారు. శుక్రవారం గంగాపురం, సంగంవలస, ములగ, బందలుప్పి పంచాయతీల్లో గల కోరి, మడకానివలస, లక్ష్మందొరవలస, దగ్గువాణిములగ, చుక్కవానివలస గ్రామాలలో ఉపాధి కూలీలకు ధర్నాకు సంబందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పి.రాము మాట్లాడుతూ రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని, ఒక పూటే పని చేపట్టాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని, టెంట్లు, మజ్జిగ, మంచినీరు సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలపై ఈనెల 15న కలక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ ధర్నాకు కూలీలంతా పాల్గొగి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.సింహాచలం, జి.అప్పలస్వామి, కళ్లి అప్పారావు, ఐద్వా సంఘం నాయకులు పి. జోగులు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ఉపాధి వేతన దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఈనెల 15న తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు కోరారు. గుమడలో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సమస్యలపై పోరాడకపోతే భవిష్యత్తులో ఈ పథకం నిర్వీర్యమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ తలపెట్టిన ధర్నాలో ఉపాధివేతనదారులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తాగునీటి కోసం కుళాయి వద్ద నిరీక్షిస్తున్న మహిళలు

పైలట్ ప్రాజెక్టు శివారు గ్రామాల్లో నీటి ఎద్దడి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలానికి సంబంధించిన అత్యధిక గ్రామాలకు తాగునీరందిస్తున్న డి-సిర్లాం, డోకిశిల, బందలుప్పి పైలెట్ ప్రాజెక్టు పంపింగ్ చేస్తున్న నీరు శివారు గ్రామాలకు సక్రమంగా చేరకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. సుమారు 25 కిలోమీటర్లకు పైగా పైపులైను ఉండడంతో తరచూ లీకులు సంభవిస్తున్నాయి. దీనికి తోడు విద్యుత్ కోతలతో ఆయా ప్రధాన ట్యాంకులకు నీరు చేరకపోవడంతో ఈ పథకానికి శివారు గ్రామాలైన పుట్టూరు, పెదబొండపల్లి, వెంకంపేట, వైకెఎంనగర్‌లోని పలు కాలనీలకు సక్రమంగా నీటి సరఫరా జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా టైల్ ఎండ్ ప్రాంతమైన వెంకంపేటపేట పంచాయతీకి పరిధిలోని వైకెఎం నగర్, మజ్జిగౌరీ, అధికారుల, కాలనీలకు నీరు సరిపడాంతగా సరఫరా కావడం లేదు. దీనికి తోడు వెంకంపేట పంచాయితీ మంచినీటి పథకం టాంక్ నుంచి ఇటీవల కొత్తగా వేసిన పైపులైన్లు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఎక్కడెక్కడ లీకులు సంభవించి తాగునీరు అందడం లేదు. లీకులను అరికట్టి మరమ్మతులు చేసే యంత్రాంగం వెంకంపేట పంచాయితీకి లేకపోవడంతో సరఫరా అవుతున్న నీరు ఎక్కువ శాతం రహదారుల పాలై వృథాగా పోతుంది. ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు స్పందించి లీకులను అరికట్టి సక్రమంగా పంపింగ్ జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాఠశాలలో నిద్రిస్తున్న మందుబాబులు

పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం పాఠశాలలో మందుబాబులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఈనెల 11న గ్రామంలో జరిగే శుభ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి బంధువులు వచ్చారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పాఠశాల మూత పడింది. దీంతో మందుబాబులు పాఠశాలను బార్‌గా మార్చేశారు. పాఠశాలకు వేసిన తాళాలు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించి, మద్యం సేవించి తరగతి గదులను చిందరవందర చేశారు. ఈ విషయం గమనించిన స్థానిక సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఫోన్లో సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లేదు. దీంతో ఎంఇఒ దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆమె తెలిపారు. గతంలో కూడా వీరఘట్టంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో మందుబాబులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి వీరంగం సృష్టించారు. వీటిపై ఆయా విద్యా సంస్థ అధికారులు పోలీసులు కూడా చేశారు. ఇదే కొనసాగితే రానున్న రోజుల్లో విద్యార్థుల సంస్థలన్నీ బార్లుగా మారే పరిస్థితి కనిపిస్తున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనలపై తక్షణమే పోలీసులు, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోగులకు సేవలందించడంలో నర్సులే కీలకం

ప్రజాశక్తి - కురుపాం

ఆస్పత్రిలో రోగులకు వైద్యులు చేసే వైద్యం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవలు కూడా అంతే ముఖ్యమని సిహెచ్‌సి వైద్యులు శోభారాణి అన్నారు. ఆసుపత్రులతో పాటు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించడంలో నర్సులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులతో కలిసిమెలిసి వారితో కుటుంబ సభ్యులు మెలుగుతూ వైద్య సదుపాయాల అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి మదర్ ఆఫ్ మోడరన్ నర్సింగ్ ఫ్లోరెన్స్ నైటింగేలుకు నివాళ్లు అర్పించారు. ఆసుపత్రిలో ఉత్తమ స్టాఫ్ నర్సులుగా సీత, మణికు అవార్డులు అందజేశారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆశ, సుకత, సాయి ఠాగూర్, హెడ్ నర్సు ఈశ్వరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నైటింగేల్‌కు నివాళ్లు అర్పిస్తున్న నర్సులు

పాలకొండ రూరల్: అంతర్జాతీయ నర్సింగ్ డే వేడుకలు స్థానిక ఏరియా హాస్పిటల్‌లో సూపరింటిండెంట్ నాగభూషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ సూపరింటెండెంట్ సోఫియా మాట్లాడుతూ ఈ వృత్తి చేయడం చాలా ఆనంద దాయకమని తెలిపారు. ఎందుకంటే అనేక మందికి సేవా దృక్పథంతో చేసే పని నర్సింగ్ అన్నారు. ఈ వృత్తిలో గుర్తింపు లేకపోయినప్పటికి అనారోగ్యంతో వచ్చిన రోగులకు 24 గంటలు అందుబాటులో ఉండి కంటికి కనురెప్పలా, నా అనుకునే వారు పట్టించుకున్నా పట్టించుకోక పోయినా చూసుకునేదే నర్స్ అన్నారు. ఈ వృత్తిలో 38 సంవత్సరాలు అనుభవం కలిగి ఉన్నానని తెలిపారు. అనంతరం నర్సింగ్ డే శుభాకాంక్షలు తెలిపారు.

స్వచ్ఛ పార్వతీపురం సాధనకు సహకరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పరిసరాల శుభ్రతను పాటిస్తూ వ్యర్థ పదార్థాల నిర్వహణ ఒక ప్రణాళిక ప్రకారం చేపట్టి స్వచ్ఛ సుందర పార్వతీపురం సాధించేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని జట్టు ఆశ్రమ నిర్వాహకులు వెనిగండ్ల పద్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణం నుంచి జట్టు ఆశ్రమం వరకు, పలు ప్రజా సంఘాలు వాకింగ్ క్లబ్ సభ్యులు, సాహితీ సంస్థ సభ్యులు సామాజిక కార్యకర్తలతో కలిసి నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం జట్టు ఆశ్రమంలో వ్యర్థ పదార్థాల నిర్వహణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలో చేపట్టామని, ఇంట్లో ఉన్న పనికిరాని పదార్థాలను తిరిగి ఉపయోగించుకుని తద్వారా వాటి నుంచి లాభం పొందేలా వ్యర్థ పదార్థాల నిర్వహణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆశ్రమాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న నిర్వహణ పనులను పరిశీలించి వాటిపై అవగాహన ఏర్పర్చుకొని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోని వ్యర్థపదార్థాలను రహదారులపై చిందరవందరగా పడేసి పరిసరాలకు వాతావరణానికి హాని కలిగించకుండా వాటికి ఒక అర్థం కల్పించాలని, జట్టు ఆశ్రమం నుంచి ప్రతి ఒక్కరికీ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఇంట్లో చెత్తను ప్రతి ఒక్కరూ వారం రోజుల పాటు సేకరించుకొని జట్టు ఆశ్రమానికి ఫోన్ చేయగలిగితే, ఆశ్రమ సభ్యులు మీ ఇళ్లకు వచ్చి వాటిని సేకరిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల తరపున నల్ల బాలకృష్ణ, వాకింగ్ క్లబ్ తరపున ఆర్ఎస్ నాయుడు, స్నేహ కళాసాహితీ సభ్యులు మళ్లీపురం జగదీష్, పక్కి రవీంద్రనాథ్‌తో పాటు పలువురు సామాజిక కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వాకింగ్ సభ్యులు, సామాజిక కార్యకర్తలు

ఇసుక, రాయి ట్రాక్టర్‌లతో భయం.. భయం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో అధిక లోడు, అతి వేగంగా వెళ్తున్న ఇసుక, రాయి ట్రాక్టర్లతో పెను ప్రమాదం పొంచి ఉందని, ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి, ప్యాలెస్ రోడ్డు గుండా ఇసుక ట్రాక్టర్లు రాగా, రావాడ జంక్షన్ రోడ్డు నుంచి మూడు మండలాలకు చెందిన రాయి ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. వేగ నియంత్రణ లేక గతంలో పలుమార్లు ఊర్లో ప్రమాదానికి గురై ప్రజలు అంగవైకల్యం చెందుతున్నారు. అధిక వేగంతో కాకుండా కనీసం లోడుతో ఉన్న వాహనానికి టార్పాలిన్లు కూడా కప్పకపోవడంతో వెనుక నుంచి వచ్చే ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు కంట్లోకి ఇసుక పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడుతో తిరిగే వాహనాలను నియంత్రించాలని కోరుతున్నారు.

ట్రాక్టర్‌పై తరలిస్తున్న ఇసుక

నేరాలు ఘోరాలు

కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జియ్యమ్మవలస మండలం చిన్నదోడిజకు చెందిన కొండగొర్రె అప్పారావు మద్యపానానికి బానిసై నిరంతరం భార్య సాయిలుతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పూటుగా తాగి వచ్చిన భర్తతో ఎందుకు తాగి వచ్చావంటూ సాయిలు అప్పారావును నిలదీసింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ఇంట్లో ఉన్న భార్య గాజులను పొడిగా చేసుకుని నీళ్లలో కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడగా, ఆగ్రహం చెందిన భార్య కూడా మిగిలిన గాజుపొడిని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం గ్రహించిన స్థానికులు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి వారిని తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

200 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో ఒడిషా నుంచి ఆంధ్రా ప్రాంతానికి నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో శుక్రవారం కొమరాడ మండలం గుమడ అగ్రహారం సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టి 160 లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. కొమరాడ మండలం గుమడకు చెందిన కోలా అజిత్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులు ఒడిషాకు చెందిన నాటు సారా సరఫరాదారు ఊయక బాల, కొమరాడ మండలం బంజుగుప్పకు చెందిన పాలక ఆనంద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అలాగే గురువారం రాత్రి పార్వతీపురం మండలం వెంకంపేట సమీపంలో నాటు సారా అమ్ముతున్న దేవిదుర్గను అరెస్టు చేసి 40 లీటర్ల నాటు సారా టిన్నులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి నాటు సారా సరఫరాదారుడు ఒడిషా రాష్ట్రం కర్లికి చెందిన జగన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ శేఖరం, హెచ్‌సి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహిరంగ నోటీసు
మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
ఓ.ఎస్. 8/2022

పండూరు ప్రభాకర రావు వగైరా ....వాదులు
మరియు
బసవ ధర్మారావు వగైరాలు ....ప్రతివాదులు

వెంపల జగదీష్, వయస్సు 41 సంIIలు, తండ్రి రామారావు, నివాసము : ఎమ్.ఆర్. నగరం, పార్వతీపురం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో వాదులు అయిన పండూరు ప్రభాకర రావు వగైరాలు పై నెంబరు దావాను మీ పైన మరియు మిగతా ప్రతివాదులుపైన మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో దాఖలు చేసి తను దావా షెడ్యూల్ దాఖల ఆస్తులకు హక్కు దారులమని నిర్ధారణ వగైరా పరిహారములు. కోరుతూ దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో మీరు 4వ ప్రతివాదియై ఉన్నారు. పై దావా **తే.14.06.2023ది** నాటికి మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున పైన పేర్కొన్న దావాలో మీకు వాదన ఉన్న యెడల మీ వ్రాతమూలక స్టేట్మెంట్ వగైరాలు ఉన్న యెడల వాటితో సహ పై వాయిదా తేదీన, సదరు కోర్టులో వ్యక్తిగతముగా గాని లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదన మరియు లిఖితములను దాఖలు జేయవలసినదిగా మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై చెప్పబడిన తేదీన హాజరు కాకుండ తప్పి పోయే యెడల మీ పరోక్షమందు పై వాద్యమును విమర్శ చేసి మహారాజశ్రీ కోర్టు వారు తీర్మానించడమగునని కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎమ్. బెనర్జీ
ఏడ్వోకేట్, బొబ్బిలి,
విజయనగరం జిల్లా,
సెల్: 9440592366.